క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవ పూజలు



మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ పాండురంగ నగర్‌లోని దేవదాయ ధర్మదాయ శాఖ శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ 31వ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం వివిధ పూజలు నిర్వహించారు. మహా కుంభ స్థానం, అగ్నిప్రతిష్ఠ, అష్టాక్షరీ హోమం, అభిషేకం, ధ్వజారోహణం, పూర్ణాహుతి, నివేదన, తీర్థ ప్రసాద వినియోగము, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ పాలక కమిటీ చైర్మన్‌ బుచ్చయ్య, ఆలయ కార్య నిర్వహణాధికారి సుధాకర్‌, కమిటీ సభ్యులు అనూపమ, నర్సింలు, రామకృష్ణారావు, జనార్ధన్‌గౌడ్‌, మల్లికార్జున్‌రెడ్డి, నాగేశ్వరరావు, అనిల్‌ కుమార్‌, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రామకృష్ణ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఎన్నికలు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌ రామకృష్ణవెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఎన్నికలు ఆదివారం జరుగనున్నాయి. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు జరుగనున్నాయి. బస్తీ అభివృద్ధిలో నిరంతరం పాటుపడుతున్న తమ ప్యానల్‌ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అధ్యక్ష అభ్యర్థిగా గడియారం గుర్తుపై పోటీ చేస్తున్న మధు కోరారు. తమ ప్యానల్‌ను గెలిపిస్తే బస్తీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



ఆల్విన్‌కాలనీ: మూడు నెలల ముందస్తు రేషన్‌ ఇవ్వడంపై బీజేపీ నాయకులు శనివారం తులసినగర్‌లోని రేషన్‌ షాపు వద్ద మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావు, నరేందర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, కుమారచారి, శ్రీనాథ్‌, సాయి కమల్‌, కవిత, శ్రీకాంత్‌, వంశీ, రాహుల్‌, సిరి, మల్లేష్‌, సుబ్బారావు, రాఖేష్‌, మల్లికా, మునీంద్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

నిజాంపేట్‌: వరంగల్‌ జిల్లా, నల్లబెల్లి మండల కేంద్ర పోలీస్‌స్టేషన్‌లో అగ్రకుల ఆధిపత్యంతో ప్రేమ జంటపై దాడి చేసిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని కేవీపీఎస్‌ జిల్లా కార్యదర్శి బాలపీరు డిమాండ్‌ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గత నెల 24న మణిరాజ్‌ -నితీష కులాంతర వివాహం చేసుకున్నారని, హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలో గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు కౌన్సిలింగ్‌ ఇచ్చి ఇరువురు మేజర్‌లు కావడం వల్ల పంపించారని తెలిపారు. ఆ జంటను విడదీయడానికి అమ్మాయి తండ్రి, బంధువులు పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. మణిరాజ్‌ బంధువులపై మూకుమ్మడి దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మళ్లీ దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన





మాదాపూర్‌: కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. చెన్నైకి చెందిన భరతనాట్య కళాకారిణి రాజేశ్వరీ తన నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇందులో స్వరజతి, జావళి, అర్ధనారీశ్వరం తదితర అంశాలను ప్రదర్శించారు. శ్రీముఖి నృత్యాలయ నాట్యగురువు మనస్విని కోనూరు శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. రంగపూజ, గజవదన బెడువే, జయము జయము, ముద్దుగారే యశోధ, గరుడగమన తదితర అంశాలను కళాకారులు మనస్విని, అంజన, రుక్మిణి, హిమశ్రీ, శ్రీలేఖ, భువన, సహస్ర, హారిణి, దివ్యశ్రీ, ఆరాధ్య, శ్రీనిక, రుత్విక, అన్విక, విజయశ్రీ, పూర్విక, మాన్విత, హరిహర తదితరులు పాల్గొని ప్రదర్శించారు.

- నిర్మాణానికి ముందుకొచ్చిన దాతలు
- రెండేళ్ల క్రితమే పనులకు శంకుస్థాపన.. పురోగతి శూన్యం
- అన్ని ఉన్నా పట్టించుకోని అధికార యంత్రాంగం

అన్ని ఉన్నాయి.. చిత్తశుద్ధే లేదు!



ఆసుపత్రి నిర్మాణం స్థలంలో చెత్తా చెదారాలు నిర్మాణ వ్యర్థాలను డంపింగ్‌ చేసి దృశ్యాలు

పాఠశాల, ఆసుపత్రి నిర్మాణానికి స్థలమిచ్చిన హౌసింగ్‌బోర్డు

జిల్లా పరిషత్‌ ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కోసం ఏకంగా రూ.2కోట్లు ఖర్చు పెట్టి నిర్మించేందుకు దాతలు ముందుకొచ్చినా.. వందకోట్ల విలువైన స్థలాన్ని ఉచితంగా కేటాయించేందుకు హౌసింగ్‌ బోర్డు సమ్మతించినా జిల్లా యంత్రాంగం మాత్రం స్పందించకపోవడం శోచనీయం. అదే విధంగా వందపడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి వందకోట్లకు పైగా విలువ చేసే ఎకరం 17 గుంటల భూమిని కేటాయించి అప్పగించేందుకు హౌసింగ్‌ బోర్డు సుముఖత వ్యక్తం చేసినా కూడా వైద్య విధాన పరిషత్‌, జిల్లా వైద్య విభాగం అధికారులు స్పందించకపోవడం బాధాకరం. రెండు సంవత్సరాల క్రితమే రెండు ప్రభుత్వ యంత్రాంగాల మంత్రులు, ముఖ్య అధికారులు హాజరై పనులకు శంకుస్థాపన చేశారు. రెండేళ్లు గడుస్తున్నా ఏ మాత్రం పురోగతి లేకపోవడం వ్యవస్థల పనితీరుకి అద్దం పడుతోంది.

కేపీహెచ్‌బీకాలనీ:

కేపీహెచ్‌బీ కాలనీతో పాటు చుట్టు పక్కల కాలనీల్లో ప్రభుత్వ హైస్కూల్‌ లేకపోవడంతో కూకట్‌పల్లి గ్రామంలోని హైస్కూల్‌కు విద్యార్థులు వస్తున్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో స్కూల్‌, ఆసుపత్రి నిర్మాణం కోసం స్థలాలను లే అవుట్‌లో కేటాయించారు. అట్టి స్థలాలను హౌసింగ్‌ బోర్డు ద్వారా ప్రైవేట్‌ వ్యక్తులు సంస్థలు కొనుగోలు చేసి అందులో స్కూల్‌, ఆస్పత్రిని నిర్మించి నిర్వహించుకోవచ్చు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానికంగా నివాసం ఉండే పేదలకు అందుబాటులో ప్రభుత్వ హైస్కూల్‌, ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పెద్దలతో పాటు అధికారులను ఒప్పించారు.

స్వర్గీయ ఎన్‌టీఆర్‌ పేరిట సొంత నిధులతో స్కూల్‌ నిర్మాణం చేపట్టి విద్యాశాఖకు అప్పగించేందుకు స్థానిక కేపీహెచ్‌బీ డివిజన్‌ కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావు ముందుకు వచ్చారు. దీంతో రమ్యా గ్రౌండ్‌ ప్రాంతంలోని సుమారు రెండువేల గజాల స్థలంలో ఎన్టీఆర్‌ పేరిట ప్రభుత్వ పాఠశాలకు అప్పటి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేశారు. పనులను కూడా మొదలుపెట్టి బీమ్‌ల నిర్మాణం కూడా చేపట్టారు.



నిర్మాణం మొదలు పెట్టి నిలిపివేసిన పనులు

అయితే సదరు స్థలాల్ని హౌసింగ్‌బోర్డు నుంచి విద్యాశాఖ అధికారులు స్వాధీనం చేసుకునే ప్రక్రియ మాత్రం పూర్తి కాలేదు. దీంతో హౌసింగ్‌ బోర్డు అధికారులు పలుమార్లు స్కూల్‌ కోసం కేటాయించిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని లేఖలు రాసినప్పటికీ విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోలేదు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జిల్లా అధికారులను స్థలం స్వాధీనం చేసుకోవాలని సూచించినా కూడా జిల్లా అధికారులు ముందుకు రావడం లేదు. దీంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే కృష్ణారావు కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదు. అయితే స్థలం స్వాధీనం చేసుకుంటే తదుపరి పాఠశాల నిర్మాణంతరం నిర్వహణ వ్యయప్రయాసల బాధ్యత జిల్లా విద్యాశాఖపైన పడుతుందనే కారణంతో ముందుకు రావడం లేదని ప్రభుత్వ అధికారులు పేర్కొంటుండటం గమనార్హం.

చెత్తకుప్పలకు నిలయంగా ఆసుపత్రి స్థలం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును పలుమార్లు కలిసి ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. హౌసింగ్‌ బోర్డు ఆసుపత్రికి వదిలిన స్థలంలోనే రెండేళ్ల కిందట అప్పటి మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. కేపీహెచ్‌బీ 5వ ఫేజు వద్ద సుమారు ఎకరం 17 గుంటల విలువైన భూమిని అప్పగించేందుకు ముందుకు వచ్చి హౌసింగ్‌ బోర్డు అధికారులు వైద్య విధాన పరిషత్‌కు లేఖ రాసింది. భూమిని స్వాధీనం చేసుకోవడం ద్వారా ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిన వైద్య విధాన పరిషత్‌ అధికారులు స్పందించలేదు. దీంతో పలుమార్లు భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ హౌసింగ్‌బోర్డు అధికారులు లేఖలు పంపినా అటు వైద్య విధాన పరిషత్‌ అధికారులు గానీ, ఇటు జిల్లా వైద్య శాఖ అధికారులు గానీ ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆసుపత్రి నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. దీంతో అక్కడి స్థలం చెత్తా చెదారాలకు నిలయంగా మారింది. ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా నిర్మాణ వ్యర్థాలను డంపింగ్‌ చేస్తున్నారు. అయితే ఆసుపత్రిని కాదంటే ప్రహరీ గోడనైనా నిర్మించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

లెటర్‌ రాసినా స్పందన లేదు

కేపీహెచ్‌బీ కాలనీలోని హౌసింగ్‌బోర్డుకు చెందిన స్కూల్‌, ఆస్పత్రి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని విద్యా, వైద్య విభాగాల అధికారులకు పలుమార్లు లెటర్లు రాశాము. అధికారికంగా భూములను హ్యాండెండ్‌ ఓవర్‌, టేకెన్‌ ఓవర్‌ పద్ధతిలో అప్పగించాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ పూర్తి కాలేదు.

– కిరణ్‌బాబు, ఈఈ, హౌసింగ్‌ బోర్డు వెస్టర్న్‌ డివిజన్‌

ముఖ్యమంత్రిని కలిసినా...



హౌసింగ్‌బోర్డులోని స్కూల్‌, ఆస్పత్రి భూములను స్వాధీనం చేసుకోవాలని ఆస్పత్రి నిర్మాణం మొదలు పెట్టాలని ముఖ్యమంత్రిని అసెంబ్లీలో కోరా. కలెక్టర్‌, డీఈఓ, డీఎంహెచ్‌ఓలను కూడా కోరాను. గత ప్రభుత్వ హయాంలో మొదలైన వాటికి సంవత్సరంన్నర గడిచినా ఇప్పటికీ ఏ మాత్రం స్పందన లేకపోవడం దురదృష్టకరం.

– మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్యే

సొంత నిధులతో..



స్వర్గీయ ఎన్టీఆర్‌పై ఉన్న అభిమానంతో ఆయన పేరిట సొంత నిధులతో హైస్కూల్‌ నిర్మాణానికి ముందుకు వచ్చాము. మాతోటి మిత్రులు కూడా సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు నిలిచిపోయాయి. త్వరగా భూమిని స్వాధీనం చేసుకుంటే పనులను ప్రారంభిస్తాం.

– మందడి శ్రీనివాసరావు, కార్పొరేటర్‌

విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

మియాపూర్‌: రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌డీఎస్‌ రాష్ట్ర గ్రేటర్‌ హైదరాబాద్‌ కన్వీనర్‌ ముత్తెన్నగారి శ్రీకాంత్‌, రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి అన్నారు. మియాపూర్‌ ఎంఏనగర్‌లో నిర్వహించే శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను ఈ నెల 9,10వ తేదీల్లో హైదరాబాద్‌ మియాపూర్‌ కేంద్రంగా జరగబోతున్నాయని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో గ్రేటర్‌ హైదరాబాద్‌ జిల్లా కమిటీ సభ్యులు వంశీ, దిలీప్‌, సందీప్‌ తదితరులున్నారు.

నిరంతరం కార్మికుల పక్షం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌



కూన శ్రీశైలంగౌడ్‌ను సన్మానిస్తున్న కార్మికులు

కుత్బుల్లాపూర్‌: నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. ఫ్లెమింగ్‌ లేబొరేటరీస్‌ కార్మికులు శనివారం షాపూర్‌నగర్‌లోని నివాసంలో ఆయనను కలిశారు. నూతన వేతన ఒప్పందం కుదుర్చిన సందర్భంగా సన్మానించారు. అనంతరం శ్రీశైలంగౌడ్‌ మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో కార్మికులకు మెరుగైన వేతనంతో పాటు ఇతర అలవెన్స్‌లు కల్పించేందుకు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ అడ్వైజర్‌ మల్లేశం, జనరల్‌ సెక్రటరీ వెంకటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

మూసాపేట: మూసాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి పాల్గొని వీధుల్లో తిరుగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. 2వ రోజు ఉపాధ్యాయ బృందం ఇంటింటికీ వెళ్లి పాఠశాలలో విద్యార్థులు సాధిస్తున్న ప్రతిభ గురించి, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, కంప్యూటర్‌ విద్య, ఒకేషనల్‌ కోర్సులు మొదలు వాటిని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కల్యాణ మహోత్సవం

మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీలోని శ్రీహరి హర క్షేత్రంలో కోదండ రామస్వామి ఆలయ శిఖర సంప్రోక్షణ, సీతారాముల కల్యాణం, మహారాజ పట్టాభిషేకం వంటి పూజా కార్యక్రమాలు ఈ నెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్‌ నాగిరెడ్డి తెలిపారు. శ్రీ త్రిదండి అహోబిల జీయరు స్వామి మంగళ శాసనములతో త్రిదండగి అహోబిల రామానుజ జీయర్‌ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పూజలు ఉంటాయని పేర్కొన్నారు. సోమవారం అష్టోత్తర కలశాభిషేకం, మంగళవారం సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, శ్రీరామ రక్ష స్తోత్ర పారాయణం, బుధవారం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, గురువారం విద్యార్థులకు హయగ్రీవ ఇష్టి, శుక్రవారం ఐశ్వర్య సిద్ధికై శ్రీమహాలక్ష్మి ఇష్టి, సాయంత్రం 6 గంటలకు శ్రీ పుష్పయాగం, శనివారం అహోబిల జీయర్‌ స్వామి కరకమలములచే కుంభ ప్రోక్షణ, 11 గంటలకు సీతారాముల కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం, అనంతరం అన్న సమారాధన, సాయంత్రం భరత్‌నగర్‌ కాలనీలో హనుమంత్‌ సేవ రాముల వారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రుల కాగలరని కోరారు.

బీజేపీ ప్రగతినగర్‌ కార్యవర్గం ఎన్నిక

నిజాంపేట్‌: బీజేపీ ప్రగతినగర్‌ కార్యవర్గాన్ని అధ్యక్షులు నరేంద్ర చౌదరి శనివారం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా మదన్‌మోహన్‌గౌడ్‌, సాకి కిషోర్‌, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, మైలవరం అశోక్‌, శివకుమార్‌ గుప్తా, నల్లమోతు నరేష్‌, కార్యదర్శులుగా నాగార్జున (అర్జున్‌), విత్తనాల సతీష్‌ విజం రామకృష్ణ, లక్ష్మి, కార్యదర్శి, ట్రెజరర్‌గా రవి 11మందితో కూడిన కార్యవర్గం, అదేవిధంగా వివిధ మోర్చాల అధ్యక్షులను ప్రకటించారు.



ఎల్లమ్మబండ చౌరస్తాలోని ఈద్గా గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున్న పాల్గొన్న ముస్లింలు, కార్పొరేటర్‌ వెంకటేష్‌గౌడ్‌

ఘనంగా బక్రీద్‌ వేడుకలు

- మజీద్‌, ఈద్గాల వద్ద ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన పీఏసీ చైర్మన్‌ గాంధీ

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో శనివారం బక్రీద్‌ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. త్యాగానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారు. వివిధ పార్టీల నాయకులు, కార్పొరేటర్‌లు ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. పీఏసీ చైర్మన్‌ గాంధీని పలువురు ముస్లింలు కలిశారు. ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మజీద్‌లు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

– కూకట్‌పల్లి (జోన్‌బృందం)



మూసాపేటలోని ఈద్గా వద్ద ..



బక్రీద్‌ శుభాకాంక్షలు తెలుపుతున్న పీఏసీ చైర్మన్‌ అరెకపూడి గాంధీ



శంషీగూడలో.. శుభాకాంక్షలు తెలుపుతున్న సతీష్‌రావు



కురుబాని ఇస్తున్న బక్రీలతో కార్పొరేటర్‌ సబిహా బేగం



ఓల్డ్‌ బోయినపల్లి డివిజన్‌లో.. కార్పొరేటర్‌ నరసింహ యాదవ్‌

ధోబీఘాట్‌ నిర్మించరూ!

- అందుబాటులో లేక చెరువునీరే ఆధారం



అంబీర్‌ చెరువు వద్ద బట్టలు ఉతికి ఆరేసిన దృశ్యం

ఆల్విన్‌కాలనీ: నాడు పల్లెల్లో చెరువుల వద్ద బట్టలు ఉతికిన రజకులు నేటికి పట్టణంలోనూ కులవృత్తిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నారు. తాతల కాలం నాటి నుంచి జీవనాధారం కోసం వారు చేసిన కులవృత్తిని వదులుకోకుండా ఇప్పటికీ తరతరాలుగా రాణిస్తున్నారు రజకులు. టెక్నాలజీ పెరుగుతున్నా దుస్తులు ఉతికే యంత్రాలు వచ్చినప్పటికీ ఆసుపత్రులు, హోటళ్లు, హాస్టళ్లు వివిధ రకాల వ్యాపార సముదాయాల నుంచి సేకరించిన దుస్తులను శుభ్రం చేయటానికి ఇప్పటికి చెరువుల వద్ద బహిరంగ ప్రదేశాల్లోనే పని చేస్తున్నారు. వారి ఉతికే ప్రదేశం శుభ్రమైనదా, అపరిశుభ్రమైందా కూడా చూసే పరిస్థితి లేదు. పట్టణం పెరిగి వసతులు కరువై జీవనోపాధి వదులుకోలేక వారు సేకరించిన దుస్తులు ఎక్కడ పడితే అక్కడ చెరువులు, కుంటల వద్ద పిండుకొని శుభ్రం చేస్తున్నారు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ, ప్రగతినగర్‌ మధ్య గల అంబీర్‌ చెరువులో రజకులు ప్రతి రోజూ ఆసుపత్రులు, హాస్టల్స్‌, హోటళ్ల నుంచి సేకరించిన దుస్తులను తీసుకువచ్చి ఉతికి ఆరవేస్తున్నారు. చెరువులోని కాలుష్య జలాల్లోనే ఉతకడంతో అవి ధరించిన వారికి రోగాలతో పాటు దురదలు వచ్చి ఇబ్బందుల పాలవుతున్నారని స్థానికులు తెలుపుతున్నారు. నిజాంపేట్‌, ప్రగతినగర్‌, శ్రీనివాస్‌నగర్‌ తదితర ప్రాంతాల నుంచి వెలువడిన మురుగు, రసాయనాలతో కూడుకున్న నీరు చెరువులో చేరి దుర్గంధం, దుర్వాసన వస్తుంది. గుర్రపుడెక్క పేరుకుపోయి చెరువులో విషపూరిత జలాల ద్వారా స్థానికులు ఘాటైన వాసనలకు ఉక్కిరి బిక్కిరి అవుతుంటారు. ఇదే నీటిలో బట్టలు ఉతుకుతున్నారు. బట్టలు ఉతకటానికి సరైన ప్రదేశం లేక, నీటి వసతులు ఇతర వసతులు లేకపోవటంతో ఈ చెరువు వద్దనే ఉతకాల్సి వస్తున్నదని రజకులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి స్థానిక రజక సంఘాల నుంచి ధోబీఘాట్‌లు ఏర్పాటు చేయాలని మొర పెట్టుకున్న ఫలితం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకులు, ఉన్నతాధికారులు రజకుల బాధక సాధకాలను గుర్తించి అన్ని వసతులతో ధోబీ ఘాట్‌లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.